ఓటరు జాబితాను అందుబాటులో ఉంచాలి

దౌల్తాబాద్, సెప్టెంబరు 14: దౌల్తాబాద్ మండలంలోని అన్నీ గ్రామాల్లో ఓటరు జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లోని ఓటర్లు తమ కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండే విధంగా ఓటరు జాబితాను సరి చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాలను పరిశీలించి తప్పులను సరిచేసుకోవాలన్నారు.

సాంకేతికతకు కేంద్రం

ఇంజనీరింగ్‌కు దిక్సూచి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఘనత

- శతాబ్దంన్నర కిందటే అద్భుత కట్టడాలు
- ఫిరంగి నాలా, జంట జలాశయాల నిర్మాణాలు
- ఇంజనీర్ స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం
- రాష్ట్రంలో అత్యధిక ఇంజనీరింగ్ కాలేజీలు ఇక్కడే
- నేడు ఇంజనీర్ల దినోత్సవం

ఇంజనీరింగ్ కాలేజీలు	రంగారెడ్డి	మేడ్చల్
	41	45



అనాటి ఇంజనీరింగ్ ప్రతిభకు గుర్తుగా నిలిచిన ఫిరంగి నాలా

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అద్భుత కట్టడాలున్నాయి. ఆ నాటి జంట జలాశయాల నుంచి నేడు చేపడుతున్న అనేక నిర్మాణాల వరకు ఇంజనీర్ల ప్రతిభ బయటపడుతుంది. ఆనాటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభతో నిర్మాణమైన అనేక కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఆయన చూపిన బాటలో నడిచేందుకు నేడు ఉమ్మడి జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువును అభ్యసిస్తున్నారు. అద్భుత ప్రతిభను చూపుతున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజు సందర్భంగా ఆయన ప్రతిభకు తార్కాణంగా సెప్టెంబరు 15ను ఇంజనీరింగ్ డేగా గుర్తిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

వికారాబాద్/మేడ్చల్, (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి).సెప్టెంబరు 14: ఇంజనీరింగ్ కేంద్రంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వర్ధిల్లుతోంది. దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నిక గల సంస్థలకు నిలయంగా మారింది. రాష్ట్రంలోనే అత్యధిక ఇంజనీరింగ్ కాలేజీలు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఇంజనీరింగ్ విద్యతో పాటు ఉత్పత్తి, సేవా రంగాల్లో అగ్రగామిగా ఉన్న ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పనలోనూ దేశంలోనే కీలంగా ఉంది. ఇక్కడ బీటెక్‌తో పాటు, ఇతర కోర్సులు చేసిన ఇంజనీర్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉండడానికి ఎంతోమంది కృషి ఉంది. ఇక్కడ కాలేజీల ఏర్పాటుతో పాటు ప్రముఖ సంస్థల నిర్మాణాలకు గత పాలకులు అహర్నిశలు శ్రమించారు. ఇక్కడ ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుతో పాటు ఉపాధి కల్పనకు అంతర్జాతీయ, జాతీయ స్థాయి కంపెనీలతో ఇక్కడ పెట్టుబడులు పెట్టించారు. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇప్పుడు ఇంజనీరింగ్‌కు కేంద్రంగా మారింది. రాష్ట్రంలో మొత్తం 175 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, ఇందులో 96 కాలేజీలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉండడం గమనార్హం. సర్కారు ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తూ కూర్చోవడం, ఇంజనీరింగ్ పట్టాలు పుచ్చుకుని సినిమా తరహాలో పరిశ్రమల చుట్టూ తిరగడం.. ఇలాంటి పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు. దీనికి కారణం ఉమ్మడి ఏపీ ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు తెలంగాణ ఆవిర్భావం తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఐటీ, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. హైటెక్ సిటీ నిర్మాణం అనంతరం శివారు ప్రాంతాల దశ తిరిగింది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ లాంటి మారుమూల గ్రామాలను కలుపుకొని హైటెక్ సిటీగా మార్చారు. దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో వందల కొద్ది సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిశ్రమలు నెలకొల్పడం వల్ల వేలాది మంది యువతీయువకులు ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంజనీరింగ్ విద్యను

- మిగతా 5వ పేజీలో



గెలుపే మార్గం



విద్యను అభ్యసించిన తర్వాత ఎవరు ఉద్యోగం ఇస్తారా? అంటూ ఎదురు చూసే పరిస్థితి ఉండకూడదు. ఇంజనీరింగ్ చేయడం ద్వారా కళాశాల దశలోనే క్యాంపస్ సెలక్షన్‌కు ఎంపికయితే అనుకున్న జీవితాన్ని సాధించుకోగలుతాం. అందుకే ఇంజనీరింగ్ విద్యను ఎంచుకున్నాను. ప్రస్తుతం సక్సెస్ వైపు నా ప్రయాణం సాగుతుంది.

- సనా సుహానా, ఇంజనీర్

భవిష్యత్తు నిర్మాణం



దేశ అభివృద్ధి నిర్మాణంలో ఇంజనీరింగ్ విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విదేశాల్లోనూ ఈ విద్యకు మంచి భవిష్యత్తు ఉంది. అందుకే ఈ విద్యను ఎంచుకున్నాం. మంచి కంపెనీల్లో అవకాశాలు వస్తే లక్షల్లో వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ విద్య వల్ల భవిష్యత్తుకు ఢోకా ఉండదు

- సాయికృష్ణ రాహుల్, ఇంజనీర్

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

ధారూరు, సెప్టెంబరు 14: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ధారూరులో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ పనితీరును ప్రచారం చేస్తూ బూత్ స్థాయిలో సభ్యత్వాలను నమోదు చేయాలని చెప్పారు. ప్రతి బూత్‌లో 200మందిని సభ్యత్వం చేయించేలా అన్నివర్గాల ప్రజల వద్దకు వెళ్లి కలవాని సూచించారు. మండలంలోని సర్పంచు నుంచి అన్ని స్థానాలలో బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, బీజేపీ నాయకులు వివేకానందరెడ్డి, పాండుగౌడ్, రాజేందర్ గౌడ్, రాజునాయక్, కేపీ రాజు, నరేందర్‌రెడ్డి, ఎన్. విశ్వనాథం, అంజయ్య, విజయలక్ష్మి, రాఘువేందర్‌గౌడ్, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అల్లరాయప్ప ఉత్సవాలు

దౌల్తాబాద్ మండలంలోని ఇమ్డాపూర్ గ్రామంలో అల్లరాయప్ప ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జాతరలో భాగంగా శనివారం స్వామివారిని పల్లకీలో గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.రాజశేఖర్, వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- దౌల్తాబాద్, సెప్టెంబరు 14



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



మరో ఛాన్స్

- గృహజ్యోతి దరఖాస్తుల్లో తప్పుల సవరణ
- అర్హులు ధ్రువపత్రాలు సమర్పిస్తే లబ్ధి

మేడ్చల్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు ఉండటంతో ఇన్నాళ్లు గృహజ్యోతి పథకానికి దూరమైన లబ్ధిదారులు తప్పులు సవరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఆన్‌లైన్‌లో ఇప్పటి వరకు ఎటువంటి ఆప్షన్ లేక అర్హులు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దరఖాస్తులు ఇచ్చే సమయంలో మీటరు నంబరు తప్పుగా నమోదు చేసినా... గృహజ్యోతి పథకం ఎదురుగా టిక్ కొట్టకపోయినా.. రేషన్ కార్డు నమోదు చేయకపోయినా తిరిగి నమోదు చేసుకునే వీలు లేకపోయింది. తాజాగా ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వడంతో అర్హులు ఎవరైనా ఉంటే తప్పులు సవరించుకుంటే గృహజ్యోతి కింద లబ్ధి పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో గృహావసరాల కనెక్షన్లు 2,33,766 లక్షలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు తెల్లరేషన్ కార్డు ఉన్న వాళ్లు లక్ష మందికిపైగా ఉన్నారు. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి నెల 200యూనిట్లు లోపు విద్యుత్తును వినియోగించుకునే వారికి జీరో బిల్లులు ఇస్తున్నారు. అర్హులకు ఇప్పుడు సవరణకు అవకాశం రావడంతో అర్హులైన వారు అవసరమైన ధ్రువపత్రాలు తీసుకెళితే తప్పులను సవరిస్తున్నారు.

ఎలాంటి పొరపాట్లు అయినా...

ప్రజాపాలన దరఖాస్తుల వేళ అవసరమైన ధ్రువపత్రాలు ఇవ్వకపోవడం, మీటరు సంఖ్య తప్పుగా నమోదు చేయడం, ఒకరి పేరున మీటరు...మరొకరి పేరున రేషన్‌కార్డులు ఉండటం, మృతి చెందిన వారి పేరున మీటర్లు కలిగి ఉండటం, వారికి సంబంధించిన ఆధార్ కార్డులు లేకపోవడం, ఉన్నాఅనుసంధానం చేసుకోకపోవడం, దరఖాస్తులో నమోదు చేయకపోవడం తదితర సమస్యలను సవరించే అవకాశం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం

సాంకేతిక తప్పిదాలతో ఇప్పటి వరకు గృహజ్యోతి రాయితీని పొందని లబ్ధిదారులు తప్పులు సవరించుకునేందుకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన లబ్ధిదారులు సహాయక కేంద్రాలకు వెళ్లి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలి.

- రవికుమార్, ఎస్ఈ

కిందిస్థాయి ఉద్యోగుల కలలను బాధ్యతగా నెరవేరుస్తాం


లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, ఉద్యోగులు

శామీర్‌పేట, సెప్టెంబరు 14: రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగుల కళలను బాధ్యతగా నెరవేరుస్తామని తెలంగాణ ఉద్యోగుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగులు ఆత్మీయ అభినందన సభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగ సంఘాల టెక్నికల్ మేనేజర్లు టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్ల తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీకి నూతనంగా ఎన్నికైన చైర్మన్ లచ్చిరెడ్డిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు సకాలంలో వేతనాలు రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈసమస్యను పరిష్కరిండానికి కృషి చేస్తానన్నారు. హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసిన తర్వాత రెవెన్యూ ఉద్యోగులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇచ్చే ఆలోచన జేఏసీకి ఉందని, రాబోయే ఫోర్త్ సిటీలో అందరికీ ఇళ్లు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

శామీర్‌పేట, సెప్టెంబరు 14: మాదకద్రవ్యాలను నిర్మూలించాలని సీఎంఆర్ ఐటీ కళాశాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ విజయ పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో శనివారం కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ విజయ, అడ్వయిజర్ జయశ్రీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతీఒక్కరు కృషిచేయాలని అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల అనర్థాలపై వారు అవగాహన కల్పిస్తు ప్రదర్శనలిచ్చారు. మాదకద్రవ్యాలను, మద్యపానం, సిగరెట్లను నివారించాలని పాఠశాల విద్యార్థులు పోస్టర్లపై రాసి ప్రదర్శించారు. తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావుగౌడ్, గోల్డ్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న బాలమల్లేశ్

తాండూరు, సెప్టెంబరు 14: తెలంగాణ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ అవమానపరుస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.బాలమల్లేష్ అన్నారు. తాండూరులో శనివారం జరిగిన వికారాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం కొనసాగించిన పోరాటాన్ని, చరిత్రను తప్పుదొవ పటిస్తున్నారని అన్నారు.17వ సెప్టెంబర్‌ను తెలంగాణ విమోచన పేరిట వక్రీకరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దినాన్ని అధికారికంగా విలీన దినంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిత్ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని పొందుపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బషీర్ ఆహ్మద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, కార్యవర్గ సభ్యులు పీర్ మహమ్మద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 14:మండల పరిధి గ్రామాల్లో ప్రజలకు వసతుల కల్పన, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కోరారు. శనివారం మాజీ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకుడు బాల్‌రెడ్డిలతో ఎ మ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నిధుల మంజూరుకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామాలు, తండాల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మఇళ్లు కేటాయించాలని కోరారు. రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తేనని, అధిక నిధులివ్వాలని కోరారు.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కాంట్రాక్టర్, నాయకులు

కత్వవాగు వద్ద రోడ్డుకు మరమ్మతు

ఆమనగల్లు, సెప్టెంబరు 14 : మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగు వద్ద శనివారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కత్వవాగు సాగి రెండు తండాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రాళ్లు తేలి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కత్వవాగును పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతు పనులను జేసీబీతో చేపట్టి రాకపోకలకు ఇబ్బందుల లేకుండా చేశారు.

సభ్యత్వ నమోదులో బీజేపీది గిన్నిస్ రికార్డ్

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మూడు చింతలపల్లి, సెప్టెంబరు 14 : ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు పొందిన పార్టీగా బీజేపీ గిన్నిస్ బుక్ రికార్డు పొందిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలో పార్టీ మండలాధ్యక్షుడు నందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల పాల్గొని సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక పండగలా జరుపుకుందామన్నారు. తెలంగాణలో బీజేపీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ బలోపేతానికి బూత్‌స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న పార్టీ గిన్నిస్ రికార్డును అధిగమించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ది శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నరేందర్ గౌడ్, నాగరాజు, మూడుచింతలపల్లి, పార్టీ మండల ఇన్‌చార్జి జగన్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సీఎంను కలిసిన మల్లు రవి



సిద్ధరామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, సెప్టెంబరు 14: కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను శనివారం పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. కర్ణాటకలోని బెంగుళూరులో సిద్ధరామయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీల అమలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గూర్చి సిద్ధరామయ్యకు వివరించినట్లు రవి తెలిపారు. అలాగే కర్ణాటకలో పార్లమెంట్ సభ్యులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పథకాల గురించి అధ్యయనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కర్ణాటక వైద్యారోగ్య శాఖ, పరిశ్రమలు, రోడ్లు, భవనాల శాఖ మంత్రులను కూడా కలిసి అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. మల్లు రవి వెంట హైదరాబాద్‌కు చెందిన కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, తదితరులు ఉన్నారు.

కౌశిక్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 14: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ ఎమ్మెల్యేపై మరో ఎమ్మెల్యే దాడికి పాల్పడటం సమంజసం కాదని, ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మాజీ జడ్పీటీసీ మహిపాల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నవాజుద్దీన్, సురేశ్‌రాజ్, రాఘవేందర్‌రెడ్డి, నందారం పవన్, రాజశేఖర్ తదితరులున్నారు.

దశలవారీగా హామీల అమలు



అభయహస్తం ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 14: ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తుందని ఆ పార్టీ నాయకులు బొక్క నరేందర్‌రెడ్డి, ఎస్.శంకర్‌గౌడ్, ఎండీ ఖదీర్, సామ పాండురంగారెడ్డిలు తెలిపారు. శనివారం మండలంలోని కొత్తగూడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అభయహస్తం ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేయనున్నట్లు గుర్తుచేశారు. అభయహస్తం ద్వారా కొత్తగూడ గ్రామస్తులకు మొదటి విడతగా 291మందికి 500వందలకు గ్యాస్ సిలిండర్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మహేందర్, చెన్న కృష్ణ, ముచ్చర్ల రవి పాల్గొన్నారు.

జర భద్రం

ఆదమరిస్తే అంతే సంగతులు ● రోడ్లు, కల్వర్టులపై ప్రమాదకరంగా గుంతలు

మరమ్మతులకు నోచని వైనం ● పట్టని అధికారులు, పాలకులు

మున్సిపాలిటీ పరిధిలో కల్వర్టులు, రోడ్లపై గుంతలు పడి రహదారులు ప్రమాదకరంగా మారాయి. నడి రోడ్లపై ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అసలే వానాకాలం వర్షపు నీటితో రోడ్లు జలమయమైనప్పుడు గుంతలు కనిపించక అందులో పడిపోతే అంతే సంగతులు. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేపట్టాలి. రోడ్లు, కల్వర్టుల వద్ద ఏర్పడిన గుంతలపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

- తాండూరు, సెప్టెంబరు 14

నడి రోడ్డులో గుంత



తులసి గార్డెన్ సమీపంలో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. రెండు నెలలు దాటినా మరమ్మతులు చేపట్టలేదు. కనీసం గుంతను పూడ్చలేదు. వర్షపు నీరు నిలిచి గుంత కనపడడం లేదు. వాహనదారులు, పాదాచారులు ఇందులో పడినా, ఇరుక్కుపోయినా ప్రాణనష్టం జరిగే అవకాశాలున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

సాయిపూర్ ప్రాంతంలోని రోడ్డుపై ఉన్న కల్వర్టుకు పెద్ద గుంత (రంధ్రం) పడింది. ప్రమాదంగా మారడంతో ప్రజలు అటువైపు వెళ్లినప్పుడు భయపడుతున్నారు. గుంతను పూడ్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాగా, తాత గుడి పక్కనే ఉన్న కల్వర్టు నుంచి రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటారు.



అంబేడ్కర్ పార్కు వద్ద..

పాత తాండూరు అంబేడ్కర్ పార్కు పక్కన పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డు వెంట బస్తీ దవాఖానకు రోగులు, సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు, పోలీసులు క్వార్టర్స్‌కు వెళ్తుంటారు. రద్దీ ఎక్కువగా ఉండే ఈ రోడ్డు పక్కన పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో అటుగా వెళ్లాలంటే జనం భయపడుతున్నారు.



రైల్వే అండర్‌బ్రిడ్జి కింద..

పాత తాండూరు ప్రజలకు రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రధాన రహదారి. నిత్యం దీని కింద నుంచి తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అసలే ఈ బ్రిడ్జి కింద లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. దాంతో రాత్రివేళ ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. అదేవిధంగా వంతెన కింద రోడ్డులో పెద్ద గుంత పడింది. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఘడి కోటేశ్వరాలయం, హరిజన వాడ బస్తీ ప్రజలు ఎక్కువగా ప్రయాణం సాగిస్తుంటారు.



ప్రమాదకరంగా కల్వర్టు

వైష్ణవి హోండా షోరూం పక్కన ఉన్న కల్వర్టు ఇది. సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఈ కల్వర్టు గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. చూసీచూడనట్లు వెళితే అందులో ఇరుక్కుపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అధికారులు మరమ్మతులు చేపట్టాలి

తాండూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో గల రోడ్లు, కల్వర్టుల మధ్య గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

సాంకేతికతకు కేంద్రం.. ఇంజనీరింగ్‌కు దిక్సూచి



ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలిచిన హిమాయత్‌సాగర్ డ్యాం నిర్మాణం

ఉమ్మడి జిల్లాల్లో పరిశ్రమలు		
రంగారెడ్డి	1,09,164	
మేడ్చల్	92,235	
వికారాబాద్	15,001	
స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)		
రంగారెడ్డి	1,98,997	
మేడ్చల్	62,506	
వికారాబాద్	14,345	
ఎగుమతుల్లో..		
జిల్లా	సరుకుల ఎగుమతి	శాతం
రంగారెడ్డి	34,249కోట్లు	29
మేడ్చల్	25,444కోట్లు	22

(3వ పేజీ తరువాయి)

అభ్యసిస్తే జాబ్ గ్యారెంటీ అని భావిస్తుండటంతో ఇంజనీరింగ్ విద్యకు ఆదరణ మరింత పెరుగుతోంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో అగ్రగామిగా ఉన్న ఉమ్మడి జిల్లా విమానాలు, హెలీకాప్టర్ల తయారీ కేంద్రంగా కూడా అవతరించింది. తలసరి, స్థూల ఉత్పత్తి, ఎగుమతుల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దూసుకుపోతోంది.

ఆనాడే.. ఇంజనీరింగ్ ప్రతిభ

దాదాపు శతాబ్దంన్నర కింద నగర శివార్లలోని గ్రామాలకు సాగు, తాగునీటి సరఫరాకు నిర్మించిన ఫిరంగి నాలా ఒక అద్భుతమనే చెప్పాలి. కబ్జాలకు, ఆక్రమణలకు గురైన ఈ నాలా గురించి ఇపుడు ఎవరికీ పెద్దగా తెలియక పోవచ్చు. కానీ, ఈ నాలా నిర్మాణం ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణమని చెప్పాలి. 85 కిలో మీటర్ల పొడవైన ఈ నాలా షాబాద్‌లోని చందన్‌వెల్లి నుంచి ప్రారంభమై ఇబ్రహీంపట్నం చెరువులో కలుస్తుంది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు నల్లగొండ ప్రాంతాలకు తాగు, సాగునీటి అవరాల కోసం అప్పటి నిజాం ప్రభువు 1872లో ఫ్రెంచ్, ఇంగ్లీష్ ఇంజనీర్ల సలహాలతో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు.. షాబాద్ మండలం చందన్‌వెల్లి నుంచి చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల మీదుగా కాలువ ప్రవహిస్తుంది. 40 నుంచి 50 గ్రామాలకు తాగునీటితో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో దీన్ని చేపట్టారు. ఈ నాలా శివార్లలోని అనేక చెరువులను కలుపుతూ చివరకు ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు చేరుకునేలా డిజైన్ చేశారు. ఈకాలువ నిర్మాణంలో అద్భుతమేమిటంటే నాలా ప్రారంభం నుంచీ చివరి వరకు సమతలంగా నీరు పారే విధంగా డిజైన్ చేయడం.

విశ్వేశ్వరుడు డిజైన్ చేసిన జంట జలాశయాలు

ఒకప్పుడు ధనవంతులకే పరిమితమైన ఇంజనీరింగ్ విద్య ప్రస్తుతం పేద, మధ్య తరగతి జీవితాల్లో కూడా కీలకంగా మారింది. మహోన్నతుడు, భారతరత్నగా గుర్తింపు పొందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య వేసిన బాట నేటి యువత భవిష్యత్తుకు బాసటగా మారింది. నేటి ఇంజనీర్ల దినోత్సవాన్ని ఒక్కసారి మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను తలుచుకుంటే.. ఆయన వేసిన బంగారు బాటలు నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాయి. విశ్వేశ్వరయ్యకు ఈ ప్రాంతానికి వీడని సంబంధం ఉంది. 1908లో హైదరాబాద్‌కు వరదలు రావడంతో వేలాది మంది చనిపోయారు. దీంతో నిజాం ప్రభువు భవిష్యత్తులో హైదరాబాద్‌కు వరద ముప్పులేకుండా చేసేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను సంప్రదించారు. దీనికి అంగీకరించిన విశ్వేశ్వరయ్య హైదరాబాద్‌కు వరద ముప్పే కాకుండా నగర వాసులకు తాగునీటి అవసరాలను తీర్చేవిధంగా ఈ రెండు జలాశయాల నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్‌కు ఇప్పటికీ ఈ జంట జలాశయాలు ప్రధాన తాగునీటి వనరులుగా ఉండడం గమనార్హం. ఇవి జలాశయాలు రంగారెడ్డిజిల్లా పరిధిలోనే ఉన్నాయి.

విద్యార్థుల సమస్యపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న భీమరాజు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 14: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు భీమరాజు అన్నారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఆర్ఎస్‌యూ జాతీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ, ఏపీలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పాఠశాల, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, అట్టి సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్‌యూ పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌గా నర్సింహారెడ్డి



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కోమటిరెడ్డి

దోమ, సెప్టెంబరు 14: నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌గా మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన ఆగిరాల నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నర్సింహారెడ్డిని మంత్రి కోమటిరెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వర్గ పోరాటాలను ఉధృతం చేస్తాం

● సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 14 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి నేటి వర్గపోరాటాలకు నాంది అని, సీపీఐ ఆధ్వర్యంలో వర్గ పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం గడీల పాలన, నిజాం నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన పోరాటం నేటికీ ప్రపంచ పోరాటాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం ముస్లిం కావడంతో హిందువుల పోరాటం అని చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ విలీన దినం జరపాలని డిమాండ్ చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. విలీన దినమని ఒక పార్టీ, విద్రోహ దినమని మరో పార్టీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధంలేని నాయకులు, పార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

ఇప్పుడు గొంతెత్తి మాట్లాడుతున్నారని, ఆనాడు జరిగిన పోరాటంలో వారు ఎక్కడ ఉన్నారని నిలదీశారు. ఆ పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో జిల్లాలో వర్గ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణాచారి, సీపీఐ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, సుధీర్, సహాయ కార్యదర్శి మక్బూల్, సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, యాదగిరి, నారాయణ, రఘు, యాదమ్మ, లలిత, వెంకటమ్మ, రమాదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి లక్ష తులసి అర్చన

చేవెళ్ల, సెప్టెంబరు 14:మండల పరిధి తంగడ్‌పల్లిలో గల దశావతార సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద, శ్రావణ మాసాల ను ముగింపును పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి నవకలశ, అభిషేకం, హోమం, సహస్రనామ అర్చనలను వేదమంత్రోచ్ఛరణల మధ్య కొనసాగించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. అర్చకులు అయ్యవారి వెంకటాచార్యులు, శేషాద్రి, వేణుమాధవ్, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.



వేంకటేశ్వరాలయంలో తులసి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

ఎస్‌జీఎఫ్‌లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కేశంపేట, సెప్టెంబరు 14: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కేశంపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి గెలిచారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. ఇందులో రాణించిన వారిని జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. అండర్ 17 కబడ్డీ బాలుర విభాగంలో ఎంజేపీ కేశంపేట విజేతగా నిలువగా, ఎస్ఆర్‌కే తొమ్మిదిరేకుల పాఠశాల రన్నరప్‌గా నిలిచింది. అండర్ 17 బాలికల కబడ్డీ విభాగంలో పాపిరెడ్డిగూడ పాఠశాల విద్యార్థులు విజేతగా నిలువగా, కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. అండర్ 14 బాలికల కబడ్డీ విభాగంలో పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతగా.. ఎంజేపీ, కేజీబీవీ విద్యార్థులు రన్నప్‌గా, అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో కేశంపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతగా, కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నప్‌గా నిలిచి సత్తాచాటారు. ఈమేరకు శుక్రవారం కేశంపేట జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మెడల్స్, మెమొంటోలు అందించారు. పీడీ, పీఈటీలను కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, కేశంపేట మండల నోడల్ అధికారి చంద్రశేఖర్‌లు అభినందించారు.



ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రహదారి పనులు.. దుమ్ముతో పరేషాన్



ఎరాన్‌పల్లి వద్ద లేస్తున్న దుమ్ము

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 14: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 167-ఎన్) పనుల్లో భాగంగా కొడంగల్ తాండూర్ మార్గంలో పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుపనులు బిట్లుబిట్లుగా చేస్తుండడంతో రోడ్డుకు ఒక పక్క తారురోడ్డు వేసిమరో పక్క మట్టి, కంకర వేసి పనులను కొనసాగిస్తున్నారు. మట్టి వేసిన చోట ట్యాంకర్‌తో నీరు పోస్తూ దుమ్ము దూళీ రేగకుండా పనులు చేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ అలా చేయకపోవడంతో వాహనదారులు దుమ్మూధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలూ కనిపించనంతగా దుమ్ము లేవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ధారూరు మార్కెట్‌లో పెరిగిన పెసర ధరలు

ధారూరు, సెప్టెంబరు 14: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం నిర్వహించిన బీట్లలో పెసళ్ల ధరలు స్వల్పంగా పెరిగాయి. గత రెండు వారాల కన్నా ఈ వారం పెసర ధరలను పెంచి ఖరీదుదారులు కొనుగోళ్లు చేశారు. మార్కెట్‌లో పెసర గరిష్ఠంగా క్వింటాలుకు రూ.8వేల నుంచి కనిష్ఠంగా క్వింటాలుకు రూ.6,400 ధర పలికింది. ఈ ధరలతో మార్కెట్‌లో 146 క్వింటాళ్ల పెసరపంటను ఖరీద్‌దారులు ఖరీదు చేశారని మార్కెట్ అధికారులు తెలిపారు.

గణేశ్ నిమజ్జనానికి రూ.4లక్షల నిధులు

● ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం ● ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్



మంజుల రమేష్, మునిసిపల్ చైర్‌పర్సన్

వికారాబాద్, సెప్టెంబరు 14: ఈనెల 17న వికారాబాద్ ఎబ్బనూర్ చెరువులో వికారాబాద్ వినాయకులను నిమజ్జనం చేయనున్నట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈసారి ఉత్సవం కనుల పండుగగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి: నిమజ్జనానికి మునిసిపల్ నుంచి ఖర్చు చేస్తున్న నిధులెన్ని?

చైర్ పర్సన్: వికారాబాద్ వినాయక నిమజ్జనాలకు రూ.4లక్షల మునిసిపల్ నిధులు కేటాయించాం. ఈ నిధులతో మునిసిపల్ తరుపున స్టేజ్ ఏర్పాటు, చెరువు వద్ద లైటింగ్, రెండు క్రేన్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఐదేళ్లుగా ఉత్సవం ఆలస్యమవుతోంది.. కారణాలేంటి?

చైర్‌పర్సన్: ఐదేళ్లుగా ఉత్సవం ఆలస్యం కావడానికి అనేక కారణాలున్నాయి. ప్రధానంగా గతంలో రోడ్డు సమస్యలుండడం, ఆ తర్వాత కరోనా వంటి కారణాలతో ఉత్సవం ఆలస్యమవుతూ వచ్చింది. గత సంవత్సరం కొంత మంది రోడ్లపైకి వచ్చిన తరువాత పోలీసులు డీజే పెట్టనివ్వరనే ఉద్దేశ్యంతో కాలనీల్లోనే ఉండి పోయారు.

ఆంధ్రజ్యోతి: ఈసారి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

చైర్‌పర్సన్: వినాయక నిమజ్జనం కన్నుల పండుగగా జరిగేందుకు ఇప్పటికే సమావేశాలు నిర్వహించాం. ఉత్సవ కమిటీ అధ్యక్షులు మాదవ రెడ్డి, హిందూ ఉత్సవ సమితి, పోలీస్ శాఖ, మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేశాం. పోలీసుల సహకారంతో 3 గంటల వరకు కొత్తగంజ్‌కు వినాయకులు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటికే రూట్ మ్యాప్ ఇచ్చారా?

చైర్‌పర్సన్: వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీస్ వారితో మాట్లాడి రూట్ మ్యాప్ నిర్ణయించాం. పోలీస్ బందోబస్తు, రోడ్ల పరిస్థితులను బట్టి రూమ్ మ్యాప్ అందిస్తాం. ఏ వైపు నుంచి వచ్చిన వినాయకులు అయినా ముందుగా కొత్తగంజ్‌లోకి వచ్చిన తరువాత అక్కడి నుంచి మహశక్తి చౌరస్తా రామమందిరం, హనుమాన్ మందిరం, బీజేఆర్ చౌరస్తా మీదుగా ఎబ్బనూర్ చెరువుకు తరలివెళ్తాయి.

ఆంధ్రజ్యోతి: మున్సిపాలిటీ తరపున గణనాథులకు స్వాగతం ఎక్కడ?

చైర్‌పర్సన్: కొత్తగంజ్ సమీపంలో పాపులర్ షూ మార్ట్ సమీపంలో మునిసిపల్ స్టేజ్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నాం. అక్కడికి తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై గణనాథులకు స్వాగతం పలుకుతారు.

ఆంధ్రజ్యోతి: ఎబ్బనూర్ చెరువు వద్ద ఏఏ ఏర్పాట్లు చేస్తున్నారు?

చైర్‌పర్సన్: ఎబ్బనూర్ చెరువు వద్ద మునిసిపల్ తరపున అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా దారి పొడవును లైటింగ్ ఏర్పాటుతో పాటు చెరువు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్నాం. ఒక వైపు నుంచి వినాయకులతో వచ్చిన వాహనాలు మరో మార్గం మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటి మాదిరిగానే రెండు క్రేన్లు ఏర్పాటు చేస్తాం. గజ ఈతగాళ్లను సైతం అందుబాటులో ఉంచుతాం.

క్రైం కార్నర్

అదృశ్యమైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కులకచర్ల, సెప్టెంబరు 14: మండలంలోని తుపాకుల తండాలో 15రోజుల కిందట అదృశ్యమైన వృద్ధుడు గోబిర్యానాయక్(70) మృతదేహం లభ్యమైంది. గతనెల 29వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయిన గోబిర్యానాయక్ తిరిగిరాలేదు. కోడలు మారు ఫిర్యాదు మేరకు వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం గుట్టలోకి పశువుల మేత కోసం వెళ్లిన కాపరులకు మృతదేహం కనిపించింది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడ ఉన్న దుస్తుల ఆధారంగా గోబిర్యానాయక్‌దిగా గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గోబిర్యానాయక్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

గేదెను కాపాడేందుకు వెళ్లి వ్యక్తి మృతి

బషీరాబాద్, సెప్టెంబర్ 13: తన గేదెను కాపాండేందుకు వెళ్లి ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన హన్మంతు గేదెలను మేపడానికి తీసుకెళ్లాడు. ఓ గేదె చెరువులో పడటంతో హన్మంతు కాపాడే ప్రయత్నం చేశాడు. చెరువు మడుగుగా ఉండడంతో అందులో చిక్కుకుపోయాడు. విషయం తెలిసిన గ్రామస్థులు కాపాడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు.

నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్



వాహనాలను సీజ్ చేస్తున్న ఎస్ఐ

దోమ, సెప్టెంబరు 14: వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో ఎస్ఐ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నెంబరు ప్లేట్ లేని 30 బైక్, మూడు త్రీవీలర్, నాలుగు ఫోర్‌వీలర్ వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

పూడూరు: నెంబర్ ప్లేట్లులేని బైక్‌లను పట్టుకుని సీజ్ చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మండల పరిధిలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్‌ప్లేట్ లేని ఎనిమిది బైక్‌లను గుర్తించినట్లు తెలిపారు. వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు తమ వాహనాలకు నెంబర్‌ప్లేట్లు పెట్టుకోవాలన్నారు. లేదంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృత్యువాత



విద్యుదాఘాతంతో మృత్యువాతపడిన ఎడ్లు

నవాబుపేట, సెప్టెంబరు 14: మండలంలోని లింగంపల్లిలో రెండు ఎడ్లు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. బాధితరైతు జూకనోళ్ల వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజు మాదిరిగా శుక్రవారం గ్రామ శివారులోని పొలం దగ్గర మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. వీటి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

బషీరాబాద్, సెప్టెంబరు 13: ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలబడి ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ గఫార్ తెలిపారు. తాండూరు నుంచి జీవన్గి వచ్చే బస్సు(టిఎస్ 34 టీఎ 5556) బషీరాబాద్ బస్టాండ్ వద్ద నిలపగా బషీరాబాద్ గ్రామానికి చెందిన జాదవ్ నవీన్ బస్సుకు ఎదురుగా నిలబడి డ్రైవర్, కండక్టర్‌తో గొడవకు దిగా వారి విధులకు ఆటంకం కలిగించాడు. కండక్టర్ బోయపల్లి సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఎర్రమట్టి తరలిస్తున్న వాహనం పట్టివేత

పూడూరు, సెప్టెంబరు 14: ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి గేటు సమీపంలో శనివారంఓ వెంచర్‌లో ఎర్రమట్టి తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడ ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎర్రమట్టి వాహనాన్ని పట్టుకున్నట్లు మైన్స్ శాఖ ఏడీకి సమాచారం అందించినట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

ఫుట్‌పాత్‌పై డబ్బాల తొలగింపునకు చర్యలు

● నోటీసులు జారీ చేసిన అధికారులు
● పరిగిలో 250కిపైగా డబ్బాలు



పరిగిలో రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై వెలసిన డబ్బాలు

పరిగి, సెప్టెంబరు 14: పరిగి పట్టణంలో హైదరాబాద్-బీజాపూర్-163 జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను, రేకులషెడ్లను, ఇతర నిర్మాణాలను తొలగించేందుకు మునిసిపల్ అధికారులు సన్నద్ధమయ్యారు. పరిగి మునిసిపల్ పరిధిలోని ప్రధాన రోడ్డుకు మధ్య డివైడర్‌తోపాటు, ఇరువైపులా చివరలో పాదచారులు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లను అనేక మంది కబ్జా చేసి డబ్బాలను, రేకులషెడ్లను, ఇతర నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.రోడ్డు చివర బైక్ పార్కింగ్‌లు చేస్తుండటంతో నడిచేందుకు అసలు దారి లేదని పాదాచారులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఇబ్బందులపై శివారెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. న్యాయస్థానం ద్వారా మునిసిపల్ అధికారులకు కోర్టుద్వారా నోటీస్ ఇప్పించేలా ప్రయత్నాలు చేశారు. ప్రాథమికంగా 250కిపైగా అక్రమంగా డబ్బాలు వేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలు, రేకులషెడ్ల నిర్మాణాలకు నోటీసులు అందజేశారు. ఈనెల 20లోపు డబ్బాలను ఖాళీ చేయాలని ఇప్పటికే నోటీసులు అందజేశారు. ఇక అక్రమిత స్థలాల్లో నిర్మాణాలను తొలగించేందుకు మునిసిపల్, నేషనల్‌హైవే, టౌన్‌ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే రాజకీయ అండదండలతోనే డబ్బాలను వేసుకున్నారని స్థానికులు అంటున్నారు. వీటిని తొలగిస్తే తమ ఉపాధి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం న్యాయస్థానం అదేశాల మేరకు తొలగించాలని భావిస్తున్నారు. మరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

అందరికీ నోటీసులు ఇచ్చాం



పరిగిలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై డబ్బాలు వేసుకున్న వారికి నోటీసులు అందించాం. పట్టణంలో దాదాపుగా 250కిపై మందికి నోటీసులు ఇచ్చాం. ఈనెల 20 వరకు తొలగించుకోవాలని వారికే గడువు ఇచ్చాం. లేదంటే వాహనాలతో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్, పరిగి

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బూపాట్కర్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 14: విద్యార్థులు నైపుణ్యత పెంపొందించుకోవాలని కన్సలెంట్, అడ్వైసర్ డాక్టర్ అషతోష బుపాట్కార్ అన్నారు. పోచారం మున్సిపాల్టీ పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'టూల్స్ టూ ఐడెంటీఫై కాంపీటెన్సీ' అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని బూపాట్కర్ మాట్లాడుతూ.. ఉపాధి అవకాశాలు, నూతన ఆవిష్కరణలకు ఈవర్క్‌షాపు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అర్చన మంతి, రిజిస్ట్రార్ డీన్ ఉట్ల బాలాజీ, విభాగాధిపతి డాక్టర్ విష్ణువందన, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ మహిపతి శ్రీనివాసరావ పాల్గొన్నారు.

ఆలయాల ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

తాండూరు రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని అంతారం అనుబంధ గ్రామమైన దస్తగిరిపేట్‌లో వెలిసిన పురాతన కాలం నాటి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, చంద్రవంచ హనుమాన్ ఆలయం, చెనిగేష్‌పూర్ హనుమాన్ ఆలయాలకు ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.కృష్ణప్రసాద్ తెలిపారు. సెక్షన్-15లోని సబ్ సెక్షన్-2 కింద డిప్యూటీ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ హైదరాబాద్ ద్వారా ఈ నోటిఫికేషన్ విడుదలైందన్నారు. బోర్డులో ఆలయ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల ఎన్నిక కోసం ఆసక్తిగల వారు 20రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అలరించిన భక్తి గానలహరి

తాండూరు, సెప్టెంబరు 14: నంది అవార్డు గ్రహీత, శ్రీ కంఠ గాయకులు డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం చేసిన భక్తి గానలహరి కార్యక్రమం భక్తులను అలరించింది. తాండూరు పట్టణ శివారు కొడంగల్ రోడ్డు మార్గంలోని రసూల్‌పూర్ శ్రీఅభయ ఆంజనేయ ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యంచే భక్తి గానలహరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూరాతమైన సంస్కృతి సంప్రదాయలను గానంతో భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శంకర్ స్వామి, దీక్షితుల భక్త బృందం పాల్గొంది.

గణేశ్ నిమజ్జనం కనుల పండువగా జరుపుదాం



వికారాబాద్: ఎబ్బనూర్ చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, సెప్టెంబరు 14: ఈ సంవత్సరం వినాయక నిమజ్జనం కనుల పండుగగా జరుపుకునేందుకు నిర్వాహకులు అందరూ సహకరించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. పోలీస్ అధికారులు, మునిసిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి శనివారం రూట్ మ్యాప్, స్టేజీ ఏర్పాటు, చెరువు వద్దచేసే ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3 వరకు కొత్తగంజ్‌కు చేరుకోవాలన్నారు. డీజే విషయమై అధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాదవరెడ్డి, కృష్ణపంతులు, చిగుళ్లపల్లి రమేష్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, సీఐ నాగరాజు, నాయకులు పాండు, కేపీ రాజు, వివేకానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో మాజీ ఎమ్మెల్యే

దౌల్తాబాద్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఇమ్దాపూర్‌లో అల్లరాయప్ప జాతర ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన శనివారం దౌల్తాబాద్‌లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: వినాయక పూజలో పాల్గొన్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తిలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమ్జిత్ అలీ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు అమ్జిత్ అలీని సన్మానించారు. ఈ శ్రీనివాస్‌గౌడ్, శామప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. వాహనాల్లో నిమజ్జనానికి వెళ్లే రోడ్డు, లక్నాపూర్ ప్రాజెక్టు వరకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు,అధికారులు మల్లేశ్, ముకుంద, వినోద్, శోభన్, గజన్ తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్: సూర్యయూత్ నిర్వహకులు చేస్తున్న కార్యక్రమాలు అందరికి ఆదర్శంగా ఉన్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో సూర్యయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆయన శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ రాజశేఖర్, నాయకులు శేఖర్, భాస్కర్, సత్తిరెడ్డి, కేఎంరెడ్డి, జితేందర్, లోకేష్, మురళి, శ్రీధర్, తిలక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో అన్నదానం

బంట్వారం (కోట్‌పల్లి): వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోట్‌పల్లి మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం దగ్గర శనివారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు దివగారి మల్‌రెడ్డి వినాయకుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.



కోట్‌పల్లిలో దీపగారి మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

సంక్షిప్తంగా..

● **శామీర్‌పేట:** మండల పరిషత్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఎంపీడీవో మమతాబాయి, పంచాయతీ కార్యదర్శులు శనివారం గ్రామాల్లో నూతనంగా రూపొందించిన ఓటర్ల ముసాయిదా జాబితా ప్రతులను ప్రదర్శించారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డులో కూడా ఆయా గ్రామాల ఓటర్ల ముసాయిదా జాబితా ప్రతులను పంచాయతీ కార్యదర్శులు ప్రదర్శించారు. ఏమైనా పొరపాట్లు, తప్పులు, అభ్యంతరములు ఉన్న ఓటర్లు ఈ నెల 21 లోపు మండల పరిషత్‌లో కాని, పంచాయతీ కార్యాలయంలో అధికారులకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

● **ధారూరు:** కేరెల్లిలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందించేందుకు మంజూరైన ప్రొసీడింగ్స్‌ను కాంగ్రెస్ నాయకులు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా పేదలకు రూ.500లకు గ్యాస్‌సిలిండర్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయమని కాంగ్రెస్‌నాయకులు తెలిపారు.

● **ఘట్‌కేసర్:** ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీకి చెందిన ఆయా విభాగాల అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండలంలోని ఘనపూర్‌లో రామలింగేశ్వర గోశాల రెండో షెడ్డు నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఈ షెడ్డు నిర్మాణానికి తిరుమలాపూర్ ఎస్ఆర్ఐ రాఘవేందర్‌రెడ్డి రూ.62వేలు, మేధాని కిరణ్ రూ.20వేలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వెంకటయ్యగౌడ్, నాయకులు ఆంజనేయులు, బసప్పచారి, రామచంద్రయ్య, నర్సింహులు, మిద్దె వెంకటయ్య, వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

● **యాలాల:** జుంటుపల్లి గ్రామ సీనియర్ నాయకులు మ్యాదరి ఆశన్న మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తం రావు వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తంచేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీసర్పంచ్ వెంకట్‌రెడ్డి, రవికుమార్, హన్మంతరావు, అక్కంపల్లి ర్యాలపేట రాములు, బాలకృష్ణగౌడ్, బస్వరాజ్‌గౌడ్, ముకుంద్‌గౌడ్, మంతట్టి బసప్ప, రాంచందర్, శాంతు పాల్గొన్నారు.

● **కొడంగల్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్ వారి ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్, నీటూర్ గ్రామాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, కాశీపతిలను సన్మానించారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లోని పీబీఆర్ ఫంక్షన్ హాలులో శనివారం సన్మానించారు.

● **కీసర:** హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాంపల్లి దాయర గ్రామంలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో హిందీ భాషాపై ప్రిన్సిపల్ పద్మాజారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. 1949వ సంవత్సరంలో సెప్టెంబర్ 14న హిందీ భాషాను గుర్తించబడిందని ఆమె తెలిపారు. ఈసందర్భంగా హిందీ భాషా ప్రాముఖ్యత, విశిష్టతపై విద్యార్థులు పలు నృత్యాలు, పాటలు, నాటకాలు మొదలైన అంశాలపై ప్రదర్శనలు పలువురిని ఆకర్శించాయి.

● **కొడంగల్:** సీతారాం ఏచూరి మృతి సీపీఎం వామపక్షాలకే కాదు యావత్ దేశానికి తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు.కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనంతయ్య, రాములు, సాయిలు, ఆంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు కొత్తూర్ చంద్రయ్య, రమేశ్‌బాబు, బలరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** పరిగి పట్టణానికి చెందిన నలుగురు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పరిగి పట్టణానికి కైలాసపతి, శశిధర్,రఘు,లక్ష్మీలను మెమోంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● **పరిగి:** విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటలకు 11 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఎండీ ఖాజా తెలిపారు. రంగంపల్లి, గడిసింగాపూర్, ఇబ్రాహింపూర్, సోండేపూర్, సాలిప్పలిబాటతండా, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** మండలంలోని కొర్రెముల్ రెవెన్యూలోని జేఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల జోనల్ క్రీడాకారుల జట్ల ఎంపిక ముగింపు కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరితాకిషోర్ అండర్14, అండర్ 17విభాగాల్లో ఖోఖో జట్లను ఎంపిక చేసి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివరాం, తిరుమల్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీసీసీ నూతన అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



మహేష్‌గౌడ్‌తో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

తాండూరు, సెప్టెంబరు 14: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌గౌడ్‌ను శనివారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, వ్యవసాయ శాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ కలిశారు.

బంట్వారం (కోట్‌పల్లి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో కోట్‌పల్లి మండల నాయకులు కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్య, వైస్‌ఛైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు బందెయ్య, మైపాల్‌రెడ్డి, మల్లేశం ఉన్నారు.

శిథిలావస్థలో వ్యవసాయాధికారి కార్యాలయం

● కూలేందుకు సిద్ధంగా భవనం ● బిక్కుబిక్కుమంటూ విధులు



శిథిలావస్థకు చేరిన వ్యవయసాయ కార్యాలయం

పరిగి, సెప్టెంబరు 14: పరిగి వ్యవసాయ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే చాటు వర్షపు నీరు స్లాబ్ నుంచి లీకై కిందకు కారుతోంది. ఒకే భవనంలో మండల వ్యవసాయాధికారి కార్యాలయం, సహాయ డివిజన్ కార్యాలయం ఉంది. నీరంతా గదుల్లో నిలిచి ఉండడంతో ఏడీఏ, ఏవోలు, ఏఈవోలు, ఇంకా సిబ్బంది విధులు నిర్వహించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం నీటిలోనే కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిన వాపోతున్నారు. ఎక్కువ వర్షం కురిస్తే కూలిపోయి ప్రమాదం జరిగే అవకాశముందని చెబుతున్నారు. నిత్యం బిక్కుబిక్కుమని కాలం వెల్లదీస్తున్నామని వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించాలని, లేదంటే ప్రత్యామ్నయ కార్యాలయాన్ని చూపించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు లేఖ రాశాం



వ్యవసాయ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరిన విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే మరమ్మతులు చేయించాలి. లేదంటే ప్రత్యామ్నాయ భవనాన్ని చూపించాలి. శిథిలమైన భవనంలో విధులు నిర్వహించడం కష్టంగా మారింది.

- లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి